క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వరుణ్



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ చింతకాయల వరుణ్

నర్సీపట్నం: మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో వైఎస్సార్ యూత్ వింగ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ చింతకాయల వరుణ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అధినేత సూచనల మేరకు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తాననివరుణ్ తెలిపారు.

ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బాలదొర

మాకవరపాలెం : ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బాలదొర నియామకమయ్యారు. ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి చింతపల్లి బదిలీ కాగా ఈమె స్థానంలో మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బాలదొరను ఇన్‌చార్జిగా నియమించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు వితరణ



విద్యార్థులకు పెన్నులు,నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ఈశ్వరప్రసాద్

రోలుగుంట : కొండపాలెం ఎంపీపీ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు కె.ఈశ్వరప్రసాద్ తన సొంత నిధులతో సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేసిన ఆయన తన కుటుంబసభ్యులతో మంగళవారం పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పిల్లలకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో అప్పారావు నాయుడు సూచించారు. మండలంలోని శెట్టిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది 29 మంది విద్యార్థులు చేరారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఈవో ఈ పాఠశాలను సందర్శించారు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దేవి కుమారైను ఈ పాఠశాలలో చదివించడంపై అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలంటూ సర్పంచ్ అల్లు రామునాయుడు డీఈవోకు వినతి పత్రం అందజేశారు. డీఈవో వెంట ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: ములకలాపల్లిలో దుర్గమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గ్రామస్తులు దుర్గమ్మ దర్శించుకొన్నారు.ఆలయ ఆవరణలో భజనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



బండారు వీధిలో ఇళ్లల్లో రోజుల తరబడి నిలిచిపోయిన వర్షపు నీరు



నిల్వ ఉన్న మురుగునీరు

గ్రామమా.. మురుగుకూపమా!

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- వీధుల్లో నిలిచిపోతున్న మురుగునీరు
- చెత్తాచెదారంతో నిండిన కాలువలు
- పారిశుధ్యంపై శ్రద్ధ చూపని పాలకులు
- తీవ్ర దుర్గంధంతో ప్రజల ఇక్కట్లు



రోలుగుంట హనుమాన్ ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త

రోలుగుంట : మండలానికి ఆదర్శంగా ఉండాల్సిన మేజర్ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. రోడ్లపైన, లోతట్టు వీధుల్లో ఇళ్లల్లో మురుగు నీరు దర్శనమిస్తుంది. స్థానిక హనుమాన్ గుడి మదుము వద్ద పేరుకుపోయిన చెత్తచెదారంతో దుర్గంధం వ్యాపిస్తోంది. సుమారు 5000 పైబడి జనాభా కలిగిన ఈ మేజర్ పంచాయతీలో 14 వార్డులున్నాయి. డ్రైనేజీల పరిస్థితి బాగులేదు. రానున్నది వర్షాకాలం, రుతుపవనాలు కూడా ముందే రావడంతో వర్షాలు కూడా అడపదడపా పడుతున్నాయి. అయితే కాలువల్లో పూడికలు తీయక ఎక్కడికక్కడ నీరు నిలిచి పోతుంది. దీంతో వీధులన్నీ మురుగు కూపంలా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి కూడా కాలువల్లో నీరు, రోడ్డుపైన పారుతోంది. బండారు వీధి, జాగారపువీధి, యాతవీధి, అల్లువారి వీధిలో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీరుపోయే మార్గం లేక మురుగుకూపంలా మారి తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది రాత్రిళ్లు నిద్ర లేకుండా చేస్తు న్నాయని, దోమ కాట్ల వల్ల జ్వరాల బారిన కూడా పడుతున్నామని బాధిత వీధి వాసులు ఆవేదన చెందుతున్నారు. పాలకులు పట్టించుకోకపోడం వల్లనే మాకీ పాట్లు అని, ఎన్నికల్లో కనిపించి మరలా ము ఖం చాటేస్తున్నారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. బీఎస్, రోడ్డు పంచాయతీ ప్రధాన రోడ్డులో గోతులు నూతులను తలపిస్తున్నాయి. ఇదీ రోలుగుంట పంచా యతీ పరిస్థితి. అధికార యంత్రాంగమైనా దృష్టి సారించి మా ఈ సమస్యలు పరిష్కరించాలని ప్రజల కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షపునీటితో నూతిని తలపించే విధంగా గోతులు

సమస్య పట్టించుకోలేదు..

అధికారంలోకి వచ్చాక కాలువలు శుభ్రం చేసి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తాం అన్నారు. సుమారు మరో ఆరు నెలల్లో పాలనాకాలం కూడా ముగియనుంది. సమస్య మాత్రం అలానే ఉంది.

–బండారు లక్ష్మి, బండారువీధి, రోలుగుంట

కాలువలు శుభ్రం చేయాలి

లోతట్టు వీధుల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి. లోతట్టు వీధుల్లోకి నీరు రాకుండా కాలువల శుభ్రం చేసి నీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలి. అసలే వర్షాకాలం.. దోమకాట్ల వల్ల ఏ రోగాలు ప్రబలుతాయేమోనని ఆందోళనగా ఉంది.

– ఎస్‌కె మీరా, రోలుగుంట

కాలువల్లో పూడికతీతకు చర్యలు

గ్రామంలో అన్ని కాలువల్లోను పూడికలు తీసే చర్యలు తీసుకున్నాం. దశల వారీగా పూడికలు తీసి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తాం. నేను ఇన్‌చార్జిగా అదనపు విధులు నిర్వహిస్తున్నాను. బీఎస్ రోడ్డుపై గుంతలు పూడ్చే పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు చేయాలి. – ఎం.రాజశేఖర్, ఇన్‌చార్జి, రోలుగుంట

వర్షపు నీరంతా రోడ్లపైనే..



నాతవరం మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిలో వాహనాల రాకపోకలు



మర్రిపాలెం స్కూల్ గేటు ముందు రోడ్డుపై ప్రవహించే నీటిలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

నాతవరం : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీరు రోడ్లపై ప్రవహించింది. నాతవరం, తాండవ జంక్షన్ మధ్య మెయిన్‌రోడ్డుపై నీరు ప్రవహించడంతో వచ్చే పోయే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తాండవ జంక్షన్ మర్రిపాలెం, ములగపూడి, మన్యపురట్ల తాండవ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుపై అధికంగా నీరు ప్రవహించింది. ఆయా ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు కూరుకుపోవడంతో నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఈ వర్షం వరి నారుమడులు దుక్కులు తయారు చేసుకునేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు అంటున్నారు. తాండవ రిజర్వాయరులో నీటి మట్టం పెరుగుతుందని ఇరిగేషన్ అధికారులు ఆశిస్తున్నారు.

ఏకధాటిగా వర్షం..చెరువుల్లో చేరిన నీరు



ముకుందపురం చెరువులో చేరిన వర్షపు నీరు

మాడుగుల రూరల్ : అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, జలాశయాల్లో నీరు చేరింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం వల్ల పల్లపు భూముల్లో నీరు చేరింది. దీంతో పాటు శారదా నది, తాచేరు, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలకు కె.జె.పురం జంక్షన్‌లో గృహ సముదాయాల మధ్యకు నీరు చేరింది.

వరి సాగులో సూచనలు పాటించండి



వారాడలో విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో సోమశేఖర్, సర్పంచ్ సౌజన్య

కె.కోటపాడు : వరి పంటను సాగు చేసే రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది సాగు విధానంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలను తప్పకుండా పాటించాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. వారాడ, వి.సంతపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు తప్పకుండా వరి పంట విత్తనాలు కిలోకి 8 గ్రాముల సూడోమోనాస్ మందుతో విత్తన శుద్ధి జరపాలని, నాట్లు మధ్య కాలిబాటలు ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొర్రుపోటు సౌజన్య, లెక్కల దేవిలత, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, వ్యవసాయశాఖ సహాయకురాలు పూజిత పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక పీఏసీఎస్ వద్ద బుధవారం రాయితీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారి చిరంజీవి తెలి పారు. వివరాలు నమోదు చేసుకొని డబ్బులు చెల్లించిన రైతులు రశీదులు తీసుకొచ్చి విత్తనాలు తీసుకోవాలన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ



నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం : నర్సీపట్నం మండలం, ధర్మసాగరం, బలిఘట్టం, అమలాపురం గ్రామాల్లో ఉచిత నట్టల నివారణ వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యూ రాంబాబు, డాక్టర్లు, కె.పుష్ప, నరేష్, టి.అలివేణి, కె.ఝాన్సీ గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ గొర్రెలు 180, 520 మేకలకు ఉచితంగా నట్టల నివార మందులు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గోపాలమిత్ర రాము పాల్గొన్నారు.

నృసింహస్వామి అవతారంలో జగన్నాథుడు



చోడవరంలో నృసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

చోడవరం : నృసింహాస్వామి అవతారంలో జగన్నాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కేశవస్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసి యున్న శ్రీ బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు ఈ ఆలయంలో స్వామివారు దశావతారం రూపాల్లో భక్తులకు దర్శన మిస్తారు. నాలుగో రోజున మంగళవారం స్వామివారు నృసింహాస్వామి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలుచేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా బీమా ఉద్యోగుల సంఘం వజ్రోత్సవాలు



వజ్రోత్సవాలు జరుపుకొంటున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నర్సీపట్నం: అఖిల భారత ఉద్యోగుల సంఘం(ఏఐఐఈఏ) 75వ దినోత్సవాన్ని స్థానిక ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కామేశ్వరరావు మాట్లాడుతూ 1956లో ఎల్ఐసీ సంఘం ఆవిర్భవించడానికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృషి చేసిందన్నారు. బీమారంగంలో ప్రాథమిక హక్కులైన జీవన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ సెలవులు, సిక్ లీవ్ వంటి హక్కుల సాధనకు ఏఐఐఈఏ కృషి చేసిందన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



గోడ ప్రతికను ఆవిష్కరింస్తున్న సీఐటీయు జిల్లా కార్యదర్శి సత్యవతి తదితరులు

రావికమతం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతి ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో జులై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. మంగళవారం ఈ సమ్మెకు సంబంధించి గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలన్నారు. సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జులై 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

మాకవరపాలెం: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్, రైతులకు నష్టం కలిగే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 9న జరిగే సమ్మెలో భారీగా పాల్గొనాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ రావికమతం మండల స్థాయి సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం : వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశాన్ని ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు చెప్పారు. రావికమతం మండలం తిరుమల కల్యాణ మండపంలో ఈ సమావేశం ఉదయం 10 గంటలకు జరుగుతుందని, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, నియోజవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్, అనకాపల్లి జిల్లా పార్లమెంట్ నియోజవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ , పరిశీలకురాలు శోభా హైమావతి పోల్గొంటారని ఎంపీపీ పైలా రాజు, పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, డీసీఎం మాజీ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ, జెడ్పీటీసీ ఆదిమూర్తి తెలిపారు. సమావేశానికి మండలంలో గల, వైఎస్సార్ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొనాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు, దంట్ల వెంకటరమణ, మత్సా భవానీప్రసాద్ తెలిపారు.

ముకుందపురంలో పింఛన్ల పంపిణీ



ముకుందపురంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్: పేద ప్రజలకు అండగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వారి ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం ముకుందపురం గ్రామంలో మంగళవారం స్థానికులతో కలిసి పింఛన్లు అందజేశారు. స్థానిక నాయకులు కర్రి మాలిబాబు, వరహాలురాజుతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, ఎంపీడీవో అప్పారావు పాల్గొన్నారు.

మాకవరపాలెం : పింఛన్ల పంపిణీని ఎంపీడీవో చాయాసుధ పరిశీలించారు. మండలంలో కొండల అగ్రహారంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల మండల వ్యాప్తంగా 10,006 మందికి పింఛను నగదు మంజూరైందన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ

మాడుగుల రూరల్ : ముకుందపురం గ్రామంలో గల పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఘనంగా నిర్వహించే ఈ పండగ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అమ్మవారిని సర్పంచ్ కర్రి గణేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం నుంచి నేల వేషాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గవరపాలెంలో ఉచిత వైద్య సేవలు

కె.కోటపాడు : గవరపాలెంలో మంగళవారం వైద్యాధికారి శశి ప్రియాంక సంచార వైద్య చికిత్స కార్యక్రమం నిర్వహించారు. 147 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందించారు. వర్షాకాలం నేపథ్యంలో వేడిచేసి చల్లార్చిన నీటిని తీసుకోవడంతో పాటు వేడి ఆహార పదార్థాలు స్వీకరించాలని సూచించారు. మంచినీటి పథకాల్లో క్లోరినేషన్, క్లీనింగ్ పనులను ఎప్పటికప్పుడు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, నిత్యజ్యోతి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధుల కాలం జాగ్రత్త..

నాతవరం: వర్షాలు కురుస్తున్న సమయంలో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని నాతవరం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి రవితేజ అన్నారు.మండలకేంద్రంలో మంగళవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలి జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి విధిగా చెత్తను సేకరించాలి



సంపద కేంద్రాన్ని పరిశీలించిన సీఈవో నారాయణమూర్తి

రావికమతం : మేడివాడ పంచాయతీ క్లాప్ మిత్రాలు(పారిశుధ్య సిబ్బంది) విధిగా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి ఆదేశించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో మేడివాడలో 70 శాతం ప్రజలు క్లాప్ మిత్రలు ఇళ్లకు రాలేదని తెలియజేశారని వెల్లడించారు. పంచాయతీకి చెందిన ఆరుగురు క్లాప్ మిత్రాలు మూడు జట్లుగా విడిపోయి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఆ చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. సర్పంచ్ వజ్రపు లీల వెంకటరత్నం, ఎంపీడీవో వెంకన్నబాబు, డిప్యూటీ ఎంపీడీవో స్వామి పాల్గొన్నారు.

వైద్యులకు వాకర్స్‌క్లబ్ సన్మానం



డాక్టర్లు రాజశేఖర్, లక్ష్మీకాంత్‌ను సన్మానిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

నర్సీపట్నం : డాక్టర్స్ డేను పురస్కరించుకుని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీకాంత్ తండ్రి, కొడుకులను వాకర్స్‌క్లబ్ వారు మంగళవారం ఘనంగా సత్కరించారు. వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు తండ్రీ కొడుకులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

అధికారులపై వేధింపులు తగదు



వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : కూటమి నాయకులు తమ ఆధిపత్య పోరుతో వడ్డాది గ్రామ ప్రతిష్టను దిగజార్చవద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. ఇటీవల కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ కూటమి నాయకుల వేధింపుల కారణంగా ఆస్పత్రి పాలైన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు స్పందించారు. స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్షులు దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టరు కోవెల జనార్దన్ రావు, ఎంపీటీసీ కోరుకొండ రమణ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతల తీరును ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులపై బెదిరింపులు పెరిగిపోయాయన్నారు. గ్రామంలో కల్యాణ మండపం, బీఎస్ రోడ్డు, పెద్దేరు వంతెన, తాగునీటి కొరత వంటి సమస్యలు పరిష్కరించడం మాని కూటమి నేతలు వర్గపోరుతో గ్రామానికి నష్టం కలిగిస్తున్నారన్నారు. అధికారం ఉందని ప్రజలను, అధికారులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. సమావేశంలో ఎన్‌సీబీఎం స్కూలు చైర్మన్ అప్పారావు, శంకరావు, అయ్యన్నదొర, నాగేష్, మురళి, రమేష్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

తడి,పొడి చెత్త సేకరణతో ఆదాయం

చీడికాడ: గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం సముపార్జించాలని ఎంపీడీవో వి. హేమసుందరావు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. జి. కొత్తపల్లి, పెదగోగాడ, గ్రామ పంచాయతీల్లో మంగళవారం చెత్త సేకరణ, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆనంతరం మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. అడపా దడపా కురుస్తున్న వర్షాల వల్ల వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి, ప్రజలుకు మంచినీటి సరఫరా చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పి.గోపి, ఎ. సన్యాసిరావు, స్రవంతి పాల్గొన్నారు.